9th - HAPPY - ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 312 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శనివారం 20 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

# గ్రూప్ 2 వాయిదా..?

## అభ్యర్థులతో డిప్యూటీ సీఎం భేటీ

## డీఎస్సీ కారణంగా వాయిదా కోరిన అభ్యర్థులు

## గత ప్రభుత్వ హయాంలో మూడు సార్లు పోస్ట్ పోన్

## తదుపరి తేదీలపై చర్చిస్తున్న సీఎం, డిసెంబర్ లో నిర్వహించే చాన్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రూప్ – 2 ఉద్యోగాల నియామక పరీక్షను వాయిదా వేసేందుకు రంగం సిద్ధమైంది. ఇవాళ మధ్యాహ్నం తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గ్రూప్ – 2 అభ్యర్థులతో చర్చించారు. డీఎస్సీ కారణంగా వాయిదా వేయాలని వారు డిప్యూటీ సీఎంను కోరారు. తాము ప్రిపేర్ కావడానికి సమయం కావాలని, ఈ నేపథ్యంలోనే వాయిదా కోరుతున్నామని అభ్యర్థులు తెలిపారు. సచివాలయాలనికి చేరుకున్న ముఖ్యమంత్రి అభ్యర్థులతో చర్చిస్తున్నారు. డిసెంబర్ లో పరీక్ష నిర్వహించాలని వారు కోరుతున్నారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు. 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్‌లో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో మూడు సార్లు గ్రూప్–2 వాయిదా పడగా.. ఈ ఏడాది ఆగస్టు 7,8 తేదీల్లో గ్రూప్–2 పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డీఎస్సీ పరీక్షలు కూడా ప్రారంభం కావడంతో గ్రూప్–2 వాయిదా వేయాలని అభ్యర్థులు ఆందోళన బాట పట్టారు. దీంతో సర్కారు వారిపట్ల సానుకూలంగా స్పందించి కీలక నిర్ణయం తీసుకోనుంది. ఈ సారి పరీక్ష వాయిదా పడితే మొత్తం నాలుగు సార్లు పోస్ట్ పోన్ అయినట్టు అయ్యింది. మొత్తం 18 విభాగాల్లో 783 పోస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2023 జనవరి 18 నుంచి ఫిబ్రవరి 16 వరకు దరఖాస్తులను స్వీకరించారు.

## స్కిల్ వర్సిటీ విషయంలో రాజీపడొద్దు



- స్కిల్ యూనివర్సిటీపై కీలక ఆదేశాలు జారీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఢిల్లీ, హర్యానా తరహాలో స్కిల్ యూనివర్సిటీ ముసాయిదాను సిద్ధం చేసిన అధికారులు
- ముసాయిదాలోని అంశాలపై పలు సూచనలు చేసిన సీఎం, డిప్యూటీ సీఎం
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్న సీఎం

వివరాలు 2లో..

## తెలంగాణలో రేవంత్ చేసినట్టే... ఏపీలో రుణమాఫీ చేయాలి



### తెలంగాణలో రుణమాఫీ చేయడంపై షర్మిల హర్షం

### ఏపీ రైతులు అన్ని విధాలుగా చితికిపోయారని వ్యాఖ్య

### రుణమాఫీ చేసి ఆదుకోవాలని విన్నపం

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిం చిన వరం రుణమాఫీ అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల కొనియాడారు. రుణమాఫీతో రైతుల కళ్లలో ఆనందం తిరిగి వచ్చిందని చెప్పారు. తెలంగాణ

వివరాలు 2లో..

## తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఆరోగ్యశ్రీ ఇస్తాం

### ఆరోగ్యశ్రీపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన

ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డు వేర్వేరుగా ఇస్తామని వెల్లడి

కాళేశ్వరం విషయంలో అన్నీ తప్పుడు లెక్కలేనని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:**తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఇక నుంచి ఆరోగ్యశ్రీని అందుబాటులోకి తీసుకు వస్తామని, అర్హులైన వారందరికీ ఆరోగ్యశ్రీ కార్డు ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డు వేర్వేరుగా ఇస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ జిల్లా పర్యటనలో ఆయన మాట్లాడుతూ... గత పదేళ్లుగా ఇరిగేషన్ ప్రాజెక్టులు నీళ్ల కోసం కాకుండా డబ్బుల కోసం కట్టారని ఆరోపించారు.

వివరాలు 2లో..

## హరీశ్ రావు రాజీనామా ఎప్పుడు చేస్తారు?

- రుణమాఫీ ఇష్టం లేని బీఆర్ఎస్ అవాకులు, చెవాకులు పేలుతోందని విమర్శ
- బీఆర్ఎస్ త్వరలో జీరో కాబోతుందన్న షబ్బీర్ అలీ
- ఏకకాలంలో రుణమాఫీ చేయడంతో బీఆర్ఎస్ కు మతిభ్రమించిందని వ్యాఖ్య



వివరాలు 2లో..

## పోటెత్తుతున్న వరద.. నిండుకుండలా హుస్సేన్ సాగర్

### హుస్సేన్ సాగర్ పూర్తి నీటిమట్టం 514 అడుగులు

### ప్రస్తుత నీటిమట్టం 513.21 అడుగులు

### మరో మూడు రోజులు తెలంగాణకు భారీ వర్ష సూచన


**హైదరాబాద్ పెన్ పవర్:**భారీగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ లోని హుస్సేన్ సాగర్ కు వరద పోటెత్తుతోంది. వరద నీటితో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. సాగర్ పూర్తి నీటిమట్టం 514 అడుగులు కాగా...

వివరాలు 2లో..



## ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడండి


### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**హైదరాబాద్ పెన్ పవర్:** మైక్రోసాఫ్ట్ లో టెక్నికల్ సమస్య కారణంగా ప్రపంచ వ్యాప్తంగా పలు విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. ప్రయాణికులు ఎయిర్ పోర్టుల్లో పడిగాపులు గాస్తున్నారు. ఇటు దేశ వ్యాప్తంగా కూడా పలు విమానాలు క్యాన్సిల్ అయ్యాయి. ఈ సమస్యపై కేంద్రమంత్రి రామ్మో హన్ నాయుడు స్పందించారు... మైక్రోసాఫ్ట్ లో వచ్చిన సమస్యతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. అనుకోని సమస్యతో ఇబ్బంది వచ్చిందన్నారు.

వివరాలు 2లో..

## 5 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ శాఖ అలెర్ట్ జారీ చేసింది. కరీంనగర్, పెద్దపల్లి ,జయశంకర్ భూపాలపల్లి ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతి భారీ వర్షాల నుంచి అత్యంత భారీ వర్షాలు పడే అవకాశమున్నట్లు తెలిపి రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కొమరం భీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశమున్నట్లు తెలిపి ఆరంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్,

వివరాలు 2లో..

## గోదావరికి వరద ఉధృతి.. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి





### తాలిపేరు ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తివేత

### జూరాలకు 20 వేల ఇన్ ఫ్లో

### నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

### భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

### రాష్ట్రంలో పలు జిల్లాలకు భారీ వర్షసూచన

వివరాలు 2లో..

**హైదరాబాద్ పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం: అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు కురుస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలోని పెద్దవాగు ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. సామర్థ్యానికి మించి నీరు రావడంతో ప్రాజెక్టు కట్టకు నిన్న అర్ధరాత్రి భారీ గండింది. రాత్రంతా నీరు దిగువకు వెళ్లడంతో ప్రాజెక్టు

## ఇంతకాలం అటెన్షన్ డైవర్షన్... ఇప్పుడేమో ఫండ్స్ డైవర్షన్

### ఏడు నెలలు ఏమార్చి చేసిన రుణమాఫీ చారాణ కోడికి బారాణ మసాలా వలె ఉందన్న కేటీఆర్

### రుణమాఫీ అయిన రైతుల కంటే కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్య

### మెజార్టీ రైతుల్లో నిరాశ మిగిల్చినందుకు సంబరాలు చేసుకుంటున్నారా? అని ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్::**రుణమాఫీపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఇంతకాలం అటెన్షన్ డైవర్షన్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఫండ్స్ డైవర్షన్ చేస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. ‘సీఎం గారు... ఊరించి.. ఊరించి.. ఏడునెలలు ఏమార్చి చేసిన.. మీ రుణమాఫీ తీరు చూస్తే.. తెలంగాణ ప్రజలకు గుర్తొచ్చిన సామెత ఒక్కటే.. చారాణ కోడికి..! బారాణ మసాలా...!!’ అన్నట్లుగా ఉందన్నారు. రుణమాఫీ అయిన రైతుల కన్నా కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయన్నారు.



వివరాలు 2లో..

## సంపాదకీయం

# పవన్ మీ పాత్ర ఏంటి..?

పవన్ కళ్యాణ్ ఇటీవల కాలంలో చాలా విషయాలపై మౌనంగా ఉండటం వెనుక చాలా తతంగం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

డిప్యూటీ సీఎంగా ఉన్నప్పటికీ, పవన్ కళ్యాణ్ కు ప్రభుత్వంలో పెద్దగా పాత్ర లేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. కూటమిలో కొందరు నాయకులు సొంత ఎజెండాతో ముందుకు వెళ్తుండడం.. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు రాష్ట్రంలో జరుగుతున్న తాజా పరిస్థితులపై చర్చించకపోవడం ఒక కారణం అంటున్నారు విశ్లేషకులు. ఈ విధంగా ముందుకు వెళ్తే రాష్ట్రంలో తాము అభాసుపాలు అవుతామనే సేనాని కినుక వహిస్తున్నారని సమాచారం కూడా లేకపోలేదు

తాజాగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే.. ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాత్ర పరిమితమా? అపరిమితమా? అనే ప్రశ్న తెరమీదికి వచ్చింది. దీనిపై ఎవరి యాంగి ల్‌లో వారు సమాధానం చెబుతున్నారు. కానీ, వాస్తవం ఎలా ఉన్నా.. పవన్ అనుసరిస్తున్న తీరు.. స్పంది స్తున్న తీరు చూస్తే మాత్రం.. తనకు తానే కొన్ని రేఖలు గీసుకుని ఆ హద్దుల్లోనే ఉండి పోతున్నారనే భావన వ్యక్తమవుతోంది. పలు కారణాలు వీటిని నిజం చేస్తున్నాయి కూడా...

ప్రస్తుతం కేంద్రంలోనూ జనసేన భాగస్వామిగానే ఉంది. ఇద్దరు ఎంపీలు ఉన్నారు. వీరిద్దరూ కూడా.. మోడీ సర్కారుకు మద్దతుగా ఎన్డీయే కూటమిలో ఉన్నారు. అయితే.. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో చంద్రబాబు ఏపీకి రావాల్సిన అంశాలు.. నిధుల అంశాలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్తున్నారు. ఈ విషయంలో పవన్ కూడా.. స్పందించాలని .. స్పందిస్తారని అందరూ అనుకున్నారు. కానీ, ఆయన ఇప్పటి వరకు బడ్జెట్ కు సంబంధించి ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. రాష్ట్రంలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వరుసగా నాలుగు రోజులుగా.. మహిళలపై ముఖ్యంగా చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నాయి. రాజకీయ హత్యలు కూడా జరుగుతున్నాయి. ఈ విషయంలో సర్కారుకు మద్దతుగా మాట్లాడేవారు.. మౌనంగా ఉన్నారు. నిజానికి ఒకప్పుడు మద్దతుగా అనేక గళాలు వినిపించాయి. కానీ, ఇప్పుడు మౌనంగా ఉండిపోయారు. ఈ పరిణామాల సమయంలో డిప్యూటీ సీఎంగా పవన్ స్పందించకపోవడాన్ని ఆయన గీసుకున్న గీతల్లో ఈ అంశం లేదేమో.. అనే భావనను కలిగిస్తోంది. అలాగే విశాఖలో వెలుగు చూసిన ఎర్రమట్టి(భీమిలి నియోజకవర్గం) దిబ్బల వ్యవహారం.. గత మూడు నాలుగు రోజులుగా రాష్ట్రంలో హాట్ టాపిక్ అయింది. ఈ మట్టి దిబ్బలను చదును చేస్తున్నారని.. ఇవి ప్రకృతి సిద్ధంగా ఏర్పడినవని పేర్కొంటూ.. పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. వాస్తవానికిఈ విషయాన్ని వెలుగు లోకి తీసుకు వచ్చింది... జనసేన నాయకుడు బొలి శెట్టి సత్యనారాయణ. అయితే.. ఈ విషయంలో పవన్ స్పందించాల్సి ఉన్నా.. అత్యంత వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తున్నారు. ఇలా.. అనేక విషయాల్లో పవన్ మౌనంగా ఉండడాన్ని చూస్తే.. కూటమి సర్కారులో ఆయన పరిమిత పాత్రనే కొరుకుంటున్నారనే భావన వ్యక్తమవుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కాలినడకన తిరుమల చేరుకున్న ఏపీ హెూంమంత్రి అనిత

ఏపీ హెూంమంత్రి వంగలపూడి అనిత మెట్లమార్గం ద్వారా కాలినడకన తిరుమల చేరుకున్నారు. అనంతరం వెంకటేశ్వర స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తిరుమల మెట్ల మార్గంలో అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని తెలిపారు. నడక మార్గంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నడక మార్గంలో దివ్య దర్శనం టోకెన్లు జారీ చేయడంలేదని, తిరిగి టోకెన్లను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు, హెూంమంత్రి అనితకు తిరుపతిలో పద్మావతి అతిథి గృహం వద్ద పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

## 5 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

- మొదటి పేజీ తరువాయి

నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశమున్నట్లు తెలిపి ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మరోవైపు హైదరాబాదులో సాయంత్రం మోస్తారు నుంచి తేలికపాటి వర్షం కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్ గా మారే సూచనల కనిపించట్లేదని.. రెడ్ అలెర్ట్ ప్రకటించిన జిల్లాల్లో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

# గోదావరికి వరద ఉధృతి..

# పెద్దవాగు ప్రాజెక్టుకు గండి

- మొదటి పేజీ తరువాయి

ఖాళీ అయింది. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, కోయరంగాపురం, కొత్తూరు, రమణక్కపేట గ్రామాలకు పాక్షికంగా నష్టం జరగ్గా ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కమ్మరిగూడెం, ఒంటిబండ, కోయమాదారం, కొత్తపూచిరాల, పాతపూచిరాల, అల్లూరినగర్, సొందిగొల్లగూడెం, వసంతవాడ, గుల్లవాయి, వేలేరుపాడు గ్రామాలకు భారీగా నష్టం సంభవించింది. వేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. వందల సంఖ్యలో పశువులు కొట్టుకుపోయాయి. పలు గ్రామాల ప్రజలు కొండలు, ఎత్తయిన భవనాల్లో రాత్రంతా తలదాచుకున్నారు. ఏం జరుగుతుందో తెలియక పరుగులు తీశారు. గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో సహాయక చర్యలకు వీలు లేకుండా పోయింది. కాగా ఇల్లందు, కోయగూడెం ఉపరితలగనిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. 35వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి.

### మంచిర్యాల జిల్లాలో

**కోటపల్లి:** మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఎదులబంధం అడవిలోని తుతుంగా ప్రాజెక్టు వద్ద గల రోడ్డు పూర్తిగా తగ్గిపోయింది. ఎదులబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, వెంచపల్లి, సూపాక, నంద్రంపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

అలుగు వాగులో కొట్టుకుపోయిన ట్రాలీ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దామెరుకుంట–, గుండ్రాత్ పల్లి మధ్యలోని అలుగు వాగులో ఇవాళ బొలెరో ట్రాలీ వెహికిల్ కొట్టుకుని పోయింది. డ్రైవర్ వాహనంపైకి ఎక్కి ఆర్తనాదాలు చేయడంతో గ్రామస్తులు అతనిని రక్షించారు. మహాముత్తారం మండలంలోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో కాటారం, మేడారం ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాటారం – మేడారం ప్రధాన రహదారిపై కొర్లకుంట వద్ద వంతెనపై నుంచి కారు అదుపుతప్పి వాగులో పడింది. మహాదేవపూర్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో కాటారం నుంచి మేడారం వైపు వెళ్తున్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. మానేరు, చలివాగు ఉగ్ర రూపం దాల్చడంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిచడంతో 7 మీటర్ల పైగా ఎత్తులో వరద కొనసాగుతోంది. మేడిగడ్డ బ్యారేజీకి 1,93,550 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. అధికారులు 85 గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు.

### భద్రాచలం వద్ద వరద ఉధృతి

ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరడంతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఇవాళ ఉదయం 9 గంటల సమయానికి 24.5 అడుగులకు చేరింది. గోదావరికి ఎగువ ప్రాంతంలో ఉన్న పేరూరులో ఉదయం 9 గంటలకు 40.86 అడుగులు నమోదైంది. ఇంద్రావతి, పేరూరు వైపు నుంచి వరద భద్రాచలం వైపు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో భద్రాచలంలో ప్రమాద స్థాయికి వరద చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తాలిపేరు ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తి 59,330 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

### జూరాలకు 20 వేల ఇన్ ఫ్లో

గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద ప్రవాహం పెరుగుతున్నది. ప్రాజెక్టులోకి 20 వేల ఇన్ ఫ్లో వస్తుండగా, 22,877 క్యూసెక్కుల నీటిని ఔట్ ఫ్లో గా వదులుతున్నారు. పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లకు గాను ప్రస్తుతం315.850 మీటర్ల నీటిమట్టం ఉంది. 9.657 టీఎంసీలకు గాను 4.951 టీఎంసీలు నీరు నిల్వ ఉంది.

### కడెం జలాశయానికి భారీగా వరద

నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి 5,437 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. జలాశయానికి పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 688.35 అడుగులకు చేరింది.

తీవ్ర అల్పపీడనం.. జిల్లాలకు భారీ వర్షసూచన

దక్షిణ, ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారింది. రానున్న 12 గంటల్లో ఇది వాయుగుండగా మారే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. హైదరాబాద్‌లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

## ఇంతకాలం అటెన్షన్ డైవర్షన్... ఇప్పుడేమో ఫండ్స్ డైవర్షన్

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు.. రైతుమాఫీ పథకానికి మరణ శాసనాలు అయ్యాయన్నారు. అన్నివిధాలా అర్హత ఉన్నా.. ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పేటోడు లేడన్నారు. రైతులు గోడు చెప్పుకుందామంటే వినేటోడు కూడా లేడన్నారు. అర్హులైన లబ్దిదారులు.. రుణమాఫీ కాక.. అంతులేని ఆందోళనలో ఉంటే ఎందుకీ సంబరాలు? అని ప్రశ్నించారు. నలభై లక్షల మందిలో.. మెజారిటీ రైతులకు నిరాశే మిగిల్చినందుకా? ముప్పై లక్షల మందిని మోసం చేసినందుకా? ఈ సంబరాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెండు సీజన్లు అయినా.. రైతు భరోసా ఇంకా షురూ చెయ్యలేదని... జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా.. జూలై వచ్చినా రైతుల ఖాతాలో వేయలేదన్నారు. కౌలు రైతులకు.. ఇస్తానన్న రూ.15 వేలు ఇయ్యలేదని మండిపడ్డారు. రైతు కూలీలకు..

రూ.12 వేల హామీ ఇంకా అమలు చేయలేదన్నారు. మభ్యపెట్టే మీ పాలన గురించి.. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఇదివరకు అటెన్షన్ డైవర్షన్, ఇప్పుడేమో ఫండ్స్ డైవర్షన్ అన్నారు.

## స్కిల్ వర్సిటీ విషయంలో రాజీపడొద్దు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ, హర్యానా తరహాలో స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముసాయిదా సిద్ధం చేయాలని సూచించారు సీఎం రేవంత్ రెడ్డి. సెక్రటేరియేట్ లో స్కిల్ వర్సిటీ అధికారులతో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క సుదీర్ఘంగా చర్చించారు. ముసాయిదాలోని అంశాలపై పలు సూచనలు జారీ చేశారు. యూనివర్సిటీల్లో సర్టిఫికెట్ కోర్సులు, డిప్లొమా కోర్సులకు సంబంధించి..సీఎం, డిప్యూటీ సీఎంలకు వివరించారు అధికారులు. కోర్సుల విషయంలో డిమాండ్ ఎక్కువగా ఉన్న రంగాలపై దృష్టిపెట్టాలన్నారు రేవంత్ రెడ్డి. శిక్షణ పూర్తైన విద్యార్థులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి కంపెనీలతో ముందుగానే మాట్లాడాలని సూచించారు. స్కిల్ వర్సిటీ విషయంలో రాజీపడొద్దన్న రేవంత్.. పూర్తిస్థాయి ముసాయిదాను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఆరోగ్యశ్రీ ఇస్తాం

- మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం విషయంలో అన్నీ తప్పుడు లెక్కలేనని, రూ.93 వేల కోట్లు ఖర్చు చేసి లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదన్నారు.పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల్లో కూడా అవినీతి జరిగిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై తెచ్చిన అప్పులకు 20 వేల కోట్ల వడ్డీ కట్టాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అత్యంత ఘోరమైన తప్పిదమన్నారు. ఈ ప్రాజెక్టు తప్పిదమని కేంద్ర జలవనరుల సలహాదారు కూడా పీసీ ఘోష్ కమిషన్ ముందు ఆధారాలతో వివరించారన్నారు. మేడిగడ్డ కాకుండా తుమ్మిడిహట్టి సరైన చోటు అని శ్రీరామ్ వెదిరె అఫిడవిట్ ఇచ్చినట్లు చెప్పారు.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వాళ్లకు నిజాలు నిగ్గు తేల్చాలని అప్పగించినట్లు చెప్పారు. బ్యారేజీ భవిష్యత్తు తేల్చాలని కోరామన్నారు. వారు కొన్ని మధ్యంతర సూచనలు చేశారని, ఆ సూచనలతో కాళేశ్వరం బ్యారేజీలో కొన్ని పనులు చేసినట్లు చెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంఛార్జ్ మంత్రిగా తాను ఆలస్యంగా వచ్చానని, ఇక నుంచి ప్రతి నెల సమీక్షలు నిర్వహిస్తానన్నారు.

కాళేశ్వరంలో పంప్ చేసిన నీటి కంటే వదిలేసిన నీళ్లే ఎక్కువ అన్నారు. ఐదేళ్లలో కాళేశ్వరంలో 65 టీఎంసీల నీళ్లు మాత్రమే వాడినట్లు చెప్పారు. కాళేశ్వరానికి సంబంధించిన అన్ని పంపులు నడిస్తే ప్రతి ఏటా రూ.10 వేల కోట్ల విద్యుత్ ఖర్చు అవుతోందని తెలిపారు. ప్రజలపై ఇంత భారం మోపారు కాబట్టే వారిని ఇంటికి పంపించారన్నారు. తెలంగాణ రైతాంగం విషయంలో విప్లవాత్మక చర్యలు తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మేలు కోరుతూ తీసుకున్న రుణమాఫీ నిర్ణయం గర్వకారణమన్నారు. బీఆర్ఎస్ ఎనిమిదేళ్లలో రూ.25 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తే, తాము ఈసారే రూ.31 వేల కోట్లు చేస్తున్నామన్నారు.

## తెలంగాణలో రేవంత్ చేసినట్టే... ఏపీలో రుణమాఫీ చేయాలి

- మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి చేసిన విధంగానే ఏపీ ప్రభుత్వం కూడా రుణమాఫీ చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. 15 ఏళ్ల క్రితం దేశ వ్యాప్తంగా ఒకే విడత రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు. ఎన్నికల వేళ రాహుల్ గాంధీ చేసిన వాగ్దానం సాకారమయిందని... తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. రైతుల తలసరి అప్పులో తొలి స్థానంలో ఉన్న ఏపీలో రైతు రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అన్ని విధాలుగా చితికిపోయిన రైతులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరుతున్నామని చెప్పారు.

## పోటెత్తుతున్న వరద.. నిండుకుండలా హుస్సేన్ సాగర్

- మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత నీటిమట్టం 513.21 అడుగులుగా ఉంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సాగర్ లోకి చేరుతున్న వరదనీటిని కిందికి వదిలేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఉన్న జనాలు కూడా అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. మరోవైపు భారీ వర్షాల కారణంగా తెలంగాణలోని పలు జిల్లాల్లోని చెరువులు, కుంటలు నిండిపోయాయి. వాగులు వరద నీటితో పోటెత్తుతున్నాయి. రానున్న మూడు రోజులు కూడా తెలంగాణలో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. హైదరాబాద్ లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## హరీశ్ రావు రాజీనామా ఎప్పుడు చేస్తారు?

హైదరాబాద్ పెన్ పవర్:ఇచ్చిన హామీ మేరకు తాము రుణమాఫీ చేశామని, ఇక హరీశ్ రావు తన ఎమ్మెల్యే పదవికి ఎప్పుడు రాజీనామా చేస్తారో చెప్పాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశ్నించారు. రైతు రుణమాఫీపై మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదన్నారు. రుణమాఫీ సంబరాల్లో భాగంగా కామారెడ్డి జిల్లాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రుణమాఫీ చేయడం బీఆర్ఎస్ పార్టీకి ఇష్టం లేదని, అందుకే అవాకులు, చెవాకులు పేలుతోందన్నారు. బీఆర్ఎస్ త్వరలో జీరో కాబోతుందని వ్యాఖ్యానించారు. గైడ్ లైన్స్ తెలియకుండానే గతంలో బీఆర్ఎస్ రుణమాఫీ చేసిందా? అని ప్రశ్నించారు. ఇంటికి ఒక్క రుణమాఫీ అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కానీ బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మవద్దన్నారు. పాస్ బుక్ ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. కాంగ్రెస్ రుణమాఫీ చేయదని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారని, కానీ ఏకకాలంలో చేయడంతో వారికి మతిభ్రమించిందన్నారు. వరంగల్‌లో రాహుల్ గాంధీని రప్పించి కృతజ్ఞత సభ నిర్వహిస్తామన్నారు. రుణమాఫీ అసాధ్యమని విపక్షాలు ఎన్నిసార్లు విమర్శించినా రేవంత్ రెడ్డి ఆ హామీని నిలబెట్టుకున్నారన్నారు. ఎనిమిది నెలల్లోనే అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని కితాబునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

## ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడండి

- మొదటి పేజీ తరువాయి

విమానాశ్రయాల్లో వేచిచూస్తున్నవారికి ఫుడ్, మంచినీళ్లు అందించాలని.. అధికారులను ఆదేశిం చారు. ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరు సహనంతో ఉంటూ.. అధికారులకు సహకరించాలని కోరారు రామ్మోహన్ నాయుడు.ప్రపంచవ్యాప్తంగా శుక్రవారం 6గంటలపాటు మైక్రోసాఫ్ట్ సర్వర్ల డౌన్ అయ్యాయి. దీంతో ఎయిర్ పోర్ట్ లో విమానయానం, బ్యాంకింగ్ ట్రాన్ జాక్షన్స్, స్టాక్ ఎక్స్చేంజ్ యాక్టివిటీస్, పలు ఎమర్జెన్సీ సర్వీసులు నిలిచిపోయాయి. ఫ్లైట్లు క్యాన్సల్ అయ్యాయి. దేశ వ్యాప్తంగా 35కు పైగా విమానాలు రద్దు అయ్యాయి. అంతేగాకుండా ఎయిర్‌పోర్టులో డిస్‌ప్లే బోర్డులు కూడా పనిచేయడం లేదు. మాన్యువల్ బోర్డు ఏర్పాటు చేశారు అధికారులు. ఏయే విమానాలు రద్దు అయ్యాయో వాటి వివరాలను బోర్డులపై రాస్తున్నారు. బోర్డింగ్ పాసులను కూడా చేతితో రాసి ఇస్తున్నారు. మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్ డౌన్ కావటంతో.. బోర్డింగ్ పాసులపై ఈ ప్రభావం పడిందని.. ఫ్లయిట్స్ లేటు అవ్వకుండా.. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బోర్డింగ్ పాసులను చేతితో రాసి ఇస్తున్నట్లు వెల్లడించారు ఎయిర్ పోర్టు అధికారులు.

# తాగునీటి కాలుష్యం.. వృషణాల క్యాన్సర్ బారినపడ్డ యువకుడు

### అమెరికాలో వెలుగు చూసిన ఘటన
### హానికారక పీఎఫ్ఏఎస్‌లను పలు కంపెనీలు వినియోగిస్తున్నాయన్న బాధితుడు
### పీఎఫ్ఏఎస్ కలుషితమైన నీరు తాగినందుకు వృషణాల క్యాన్సర్ వచ్చిందని కేసు
### ఈ రసాయనాల చెడు ప్రభావంపై తనకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఆవేదన
### తమ నష్టానికి పరిహారం చెల్లించాలంటూ బాధితుడు, అతడి భార్య కేసు




**హైదరాబాద్ పెన్ పవర్:** హానికారక రసాయనాలతో కలుషితమైన నీరు తాగి వృషణాల క్యాన్సర్ బారినపడ్డానంటూ అమెరికాలోని ఓహియో రాష్ట్రం ఏంగిలే ఉడ్ నగరానికి చెందిన ఓ యువకుడు (29) కోర్టులో కేసు దాఖలు చేశాడు. నీటి కాలుష్యానికి కారణమైన కెమికల్ కంపెనీలను కోర్టుకీడ్చాడు. బాధితుడి ఫిర్యాదు ప్రకారం, పాలీఫ్లోరోఆల్కైల్ రసాయనాలను (పీఎఫ్ఏఎస్) వాడే రెండు డజన్లకు పైగా కంపెనీల కారణంగా తన తాగునీరు కలుషితమైందని ఆరాన్ అడ్కిన్స్ ఆరోపించాడు. 3ఎమ్, డూపాంట్ సంస్థలే దీనికి ప్రధానకారణమని పేర్కొన్నారు. సాధారణంగా మంటలను ఆర్పేందుకు వినియోగించే ఆక్వియ్ ఫిల్మ్ ఫార్మింగ్ ఫోమ్ తయారీలో పీఎఫ్ఏ రసాయనాలను వాడతారు. ఇప్పటికే అమెరికాకు చెందిన పర్యావరణ పరిరక్షణ సంస్థ నీటి కాలుష్యంపై దృష్టి సారించింది. తాగునీటిలో పీఎఫ్ఏ రసాయనాల స్థాయులను నిర్దేశిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆరాన్ అడ్కిన్స్ కేసుకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇక కొన్నేళ్లపాటు పీఎఫ్ఏ రసాయనాలతో కలుషితమైన నీటిని తాగి ఆరాన్ క్యాన్సర్ బారినపడ్డట్టు ఫిబ్రవరిలో తేలింది.

మరోవైపు, ఆరాన్ భార్య కూడా కోర్టును ఆశ్రయించింది. తన భర్త క్యాన్సర్ కారణంగా తాను నరకం అనుభవించానని చెప్పుకొచ్చింది. భాగస్వామి సాంగత్యానికి దూరమయ్యానని పేర్కొంది. ఇది చివరకు తన వివాహ బంధంపై ప్రతికూల ప్రభావం చూపించిందని చెప్పుకొచ్చింది. నీటి కాలుష్యానికి బాధ్యులైన కంపెనీలు తమకు పరిహారం చెల్లించాలని తమ కేసులో వీరు కోరారు. నీటిలోని ఫ్లోరోరసాయన ఉత్పత్తుల కారణంగా జరిగే నష్టాల గురించి బాధ్యులైన కంపెనీలు తమను హెచ్చరించలేదని పేర్కొన్నారు.

అగ్నిమాపక రసాయనాలతో పాటు నాన్‌స్టిక్ కుక్ వేర్ వంటి ఇతర రసాయనాల్లోనూ పీఎఫ్ఏఎస్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ కెమికల్స్ చాలా ఏళ్ల పాటు అలాగే ఉండిపోతాయని, అధిక మోతాదుల్లో వీటి బారిన పడేవారికి తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు.

## మైక్రోసాఫ్ట్ సాంకేతిక సమస్య... స్పందించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

### కారణాలను గుర్తించారని... పరిష్కారానికి అప్ డేట్స్ విడుదలయ్యాయని వెల్లడి
### ఎంఈఐటీవై నిరంతరం మైక్రోసాఫ్ట్‌తో టచ్‌లో ఉన్నట్లు వెల్లడి
### మైక్రోసాఫ్ట్ ప్రభావం తమపై లేదన్న ఎన్ఎస్ఈ, బీఎస్ఈ




**హైదరాబాద్ పెన్ పవర్:** మైక్రోసాఫ్ట్ సేవలు నిలిచిపోవడానికి గల కారణాల్ని గుర్తించారని, వీటి పరిష్కారానికి అప్‌డేట్స్ విడుదలయ్యాయని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ విండోస్‌లో శుక్రవారం సాంకేతిక సమస్య తలెత్తింది. కంప్యూటర్లలో బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ కనిపించింది. దీంతో ఆయా సిస్టంలు షట్ డౌన్ కావడం లేదా రీస్టార్ట్ కావడం జరిగింది. విండోస్ సరిగ్గా లోడ్ కాలేదు... రీస్టార్ట్ చేయడానికి ప్రయత్నించండని మెసేజ్ చూపించింది. ఈ ఎర్రర్‌తో ప్రపంచవ్యాప్తంగా పలు సేవలపై ప్రభావం పడింది.


మైక్రోసాఫ్ట్ సాంకేతిక సమస్యపై కేంద్రమంత్రి స్పందించారు. ఇందుకు సంబంధించి ఎంఈఐటీవై (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) నిరంతరం మైక్రోసాఫ్ట్‌తో టచ్‌లో ఉందన్నారు. ఈ సాంకేతిక సమస్యకు కారణాలు గుర్తించినట్లు తెలిపారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ నెట్ వర్క్‌పై ఎలాంటి ప్రభావం పడలేదన్నారు. ఈ సమస్యకు సంబంధించి కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (%జజు=ు%) సాంకేతిక సలహాలను జారీ చేస్తుందన్నారు.

**మైక్రోసాఫ్ట్ ప్రభావం మాపై లేదు: ఎన్ఎస్ఈ**
నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీపై మైక్రోసాఫ్ట్ అంతరాయం ప్రభావం లేదని ఎన్ఎస్ఈ ప్రకటించింది. వివిధ దేశాల స్టాక్ ఎక్స్ఛేంజీలపై ప్రభావం నేపథ్యంలో ఎన్ఎస్ఈ స్పందించింది. తమపై ఎలాంటి ప్రభావం లేదని బీఎస్ఈ కూడా ప్రకటించింది.

**క్రౌడ్ స్ట్రయిక్ అప్ డేట్ కారణంగా సాంకేతిక సమస్య**
కంప్యూటర్లలో బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ కనిపించి... ఆ తర్వాత సిస్టంలు షట్ డౌన్ లేదా రీస్టార్ట్ అయ్యాయి. విండోస్ సరిగ్గా లోడ్ కాలేదు... రీస్టార్ట్ చేయడానికి ప్రయత్నించండని మెసేజ్ చూపించింది. ఈ ఎర్రర్‌తో ప్రపంచవ్యాప్తంగా పలు సేవలపై ప్రభావం పడింది. క్రౌడ్ స్ట్రయిక్ అప్ డేట్ కారణంగా ఈ సమస్య తలెత్తినట్లు మైక్రోసాఫ్ట్ ధ్రువీకరించింది. క్రౌడ్ స్ట్రయిక్ అనేది ఓ సైబర్ సెక్యూరిటీ సంస్థ. విండోస్‌తో పాటు వివిధ సంస్థలకు అడ్వాన్స్ సెక్యూరిటీని అందిస్తుంటుంది. తాజాగా విండోస్ సిస్టమ్స్‌లో నెలకొన్న బ్లూ స్క్రీన్ ఎర్రర్‌కు ఆ సర్వీసు అప్ డేట్ కారణమని క్రౌడ్ స్ట్రయిక్ వెల్లడించింది. ఈ సమస్య పరిష్కారం కోసం ఇంజినీర్లు పని చేస్తున్నట్లు తెలిపింది.

## సమస్యను పరిష్కరించాం... ఇలా చేయండి!: మైక్రోసాఫ్ట్

### విండోస్ సర్వీసుల్లో తలెత్తిన అంతరాయాన్ని పరిష్కరించినట్లు వెల్లడి
### ఇది సైబర్ సెక్యూరిటీ దాడి కాదని స్పష్టీకరణ
### క్రౌడ్ స్ట్రయిక్ సంస్థ ఇచ్చిన అప్ డేట్ కారణంగా ఎర్రర్ వచ్చినట్లు వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** విండోస్‌లో బ్లూ స్క్రీన్ ఎర్రర్ సమస్యను పరిష్కరించినట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. విండోస్ సర్వీసుల్లో తలెత్తిన అంతరాయాన్ని పరిష్కరించామని ఐటీ దిగ్గజం ప్రతినిధులు తెలిపారు. బ్లూ స్క్రీన్ ఎర్రర్ సమస్య సైబర్ సెక్యూరిటీ దాడి కాదని మైక్రోసాఫ్ట్ స్పష్టం చేసింది.క్రౌడ్ స్ట్రయిక్ సంస్థ ఇచ్చిన కొత్త అప్ డేట్ కారణంగా బ్లూ స్క్రీన్‌పై ఎర్రర్ వచ్చినట్లు తెలిపింది. క్రౌడ్ స్ట్రయిక్ అనేది ఓ సైబర్ సెక్యూరిటీ సంస్థ అని వెల్లడించింది. సమస్యను ఎలా పరిష్కరించాలో కూడా తెలిపింది. క్రౌడ్ స్ట్రైక్ డైరెక్టరీలో సీ-సీ00002918. %ంఎం% ఫైల్‌ను తొలగించాలని సూచించింది. సేఫ్ లేదా రికవరీ మోడ్‌లో ఓపెన్ చేయాలని పేర్కొంది. అప్పటికీ సమస్య పరిష్కారం కాకుంటే అలాంటి వారి కోసం అప్ డేట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది.

## పది పాసైతే.. సెంట్రల్ గవర్నమెంట్ జాబ్.. నోటిఫికేషన్ రిలీజ్




**హైదరాబాద్ పెన్ పవర్:** పోస్టల్ శాఖలో GDS రిక్రూట్మెంట్ 2024 నోటిఫికేషన్ విడుదలైంది . దేశవ్యాప్తంగా వివిధ సర్కిళ్లలో 44,228 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ లో 656 ఖాళీలు.. తెలంగాణలో 454 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ నోటిఫిషన్ ద్వారా జీడీఎస్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ లేదా డాక్ సేవక్ ఖాళీలను భర్తీ చేస్తారు. ఈ పోస్టులకు ఆన్లైన్ అప్లికేషన్ స్వీకరణ ప్రారంభమైంది. . దరఖాస్తు చివరి తేది ఆగస్టు 5, 2024గా నిర్ణయించారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఈ పోస్టులకు ఎంపిక ఉంటుంది. indiapostgdsonline.gov.in ద్వారా ఉద్యోగాల కోసం ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఉద్యోగాలకు అప్లై చేసే వారి వయసు 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వరకూ గరిష్ట వయసులో సడలింపు ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ట్రాన్స్‌ఉమెన్ అభ్యర్థులకు ధరఖాస్తు ఫీజు ఉండదు. మిగిలినవారు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.తెలుగు రాష్ట్రాల నుంచి ఆసక్తిగల అభ్యర్థులు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చు.

**జీతం ఎంతంటే...**
ఉద్యోగం పొందిన వారు బ్రాంచ్ పోస్ట్మాస్టర్ (BPM), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్మాస్టర్ (ABPM) / డాక్ సేవక్ గా నియమితులవుతారు.
ABPM / GDS జాబ్స్: రూ. 10,000 నుంచి రూ. 24,470 వరకు
BPM జాబ్స్ : రూ.12,000 నుంచి రూ..29,380వరకు
10వ తరగతి సర్టిఫికేట్ ఉన్న 18 నుంచి -40 సంవత్సరాల మధ్య ఉన్నవారు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు.

**దరఖాస్తు విధానం:**
దరఖాస్తు విధానం మూడు దశల్లో ఉంటుంది. అవి రిజిస్ట్రేషన్, దరఖాస్తు రుసుము, ఆన్లైన్ దరఖాస్తు. ఎలా అప్లై చేయాలో తెలుసుకుందాం..
ఇండియా పోస్ట్ అధికారిక వెబ్సైట్ www.indiapostgdsonline.gov.in ను సందర్శించండి.
ఇక్కడ మీ వివరాలతో రిజిస్టర్ చేసుకోవాలి.
పాస్‌వర్డ్ తో నమోదు చేసుకోవడానికి మొబైల్ నంబర్, ఇమెయిల్ ID అవసరం
రిజిస్ట్రేషన్ నెంబర్ జనరేట్ అయిన తర్వాత లాగిన్ అయి ఫీజ్ పేమెంట్ చేయాలి.
తర్వాత ఆసక్తి ఉన్న పోస్టులకు అప్లై చేసుకోవాలి.
అనంతరం మీరు డివిజన్ ఎంపిక చేసుకోవాలి.
అనంతరం ఫోటో, సంతకం.. చెప్పిన ఫార్మాట్ ప్రకారం అప్లోడ్ చేయాలి.
మీరు దరఖాస్తు చేస్తున్న డివిజన్ డివిజనల్ హెడ్? మీరు తప్పక ఎంచుకోవాలి. రిక్రూట్? మెంట్ తర్వాతి దశలో మీ పత్రాలను పరిశీలిస్తారు.

**ఎలా సెలక్ట్ చేస్తారు?**
మెరిట్ జాబితా ప్రకారం అభ్యర్థులు షార్ట్? చేస్తారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా ఉండనుంది. సెలక్ట్ అయిన అభ్యర్థుల వివరాలు జీడీఎస్ పోర్టల్ అప్లోడ్ చేస్తారు. మీ మొబైల్ నెంబర్, ఈమెయిల్? వెరిఫికేషన్ వివరాలను పంపిస్తారు.

## చిరంజీవిపై సంచలన వ్యాఖ్యలు చేసిన జగ్గారెడ్డి

### రైతుల సమస్యలను చిరంజీవి పట్టించుకోవడం లేదన్న జగ్గారెడ్డి
### మోదీ, పవన్ కు మాత్రమే మద్దతిస్తున్నారని విమర్శ
### రాహుల్ కు ఎందుకు సపోర్ట్ చేయడం లేదని ప్రశ్న



**హైదరాబాద్ పెన్ పవర్:** మెగాస్టార్ చిరంజీవిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతులకు జరుగుతున్న నష్టాలపై సినిమాలు తీసిన చిరంజీవి... ఢిల్లీలో ధర్నాలు చేసిన రైతులకు ఎందుకు మద్దతు ఇవ్వలేదని ప్రశ్నించారు. సినిమాలతో కోట్లు సంపాదిస్తున్న మీరు రైతు సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని అడిగారు.
రైతుల పేరుతో తీసిన సినిమాలతో డబ్బులు సంపాదిస్తూ... ప్రధాని మోదీకి మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. మోదీకి, పవన్ కు మాత్రమే ఎందుకు మద్దతిస్తున్నారని... రైతులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీకి ఎందుకు సపోర్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉండి ఉంటే చిరంజీవి సక్రమ మార్గంలో ఉండేవారని... ఇప్పుడు పక్కదారి పట్టారని అన్నారు.
కేసీఆర్ గత పదేళ్లలో రూ. 7 లక్షల కోట్లు అప్పు చేసి రైతులకు కేవలం రూ. 26 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని... తమ కాంగ్రెస్ ప్రభుత్వం 6 నెలల్లోనే రూ. 31 వేల కోట్లు ఇచ్చిందని జగ్గారెడ్డి చెప్పారు. ఇప్పటిదాకా బీజేపీ ఎన్ని వేల కోట్ల రూపాయల రైతు రుణమాఫీ చేసిందని ప్రశ్నించారు. కేటీఆర్ ట్విట్టర్ కే పనికొస్తాడని... పనికి పనికిరాడని విమర్శించారు.

## భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

### అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్న సూచీలు
### 738 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
### 269 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూలతలు, మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం తదితర కారణాలతో సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ ఒక్క రోజే ఏకంగా రూ. 8 లక్షల కోట్ల సంపద ఆవిరయింది. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 738 పాయింట్లు కోల్పోయి 80,604కి దిగజారింది. నిఫ్టీ 269 పాయింట్లు నష్టపోయి 24,530 వద్ద స్థిరపడింది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**
ఇన్ఫోసిస్ (1.92%), ఐటీసీ (0.89%), ఏసియన్ పెయింట్ (0.53%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (0.03%).

**టాప్ లూజర్స్:**
టాటా స్టీల్ (-5.17%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (-4.36%), ఎన్టీపీసీ (-3.51%), టాటా మోటార్స్ (-3.43%), అల్ట్రాటెక్ సిమెంట్ (-3.28%).

## వృద్ధాప్యాన్ని కలుగజేసే ప్రొటీన్ గుర్తింపు.. జీవితకాలాన్ని 25 శాతం మేర పెంచే ఛాన్స్!

- వృద్ధాప్యంలో కనిపించే శారీరక బలహీనతకు ఐఎల్-11 ప్రొటీన్ కారణమన్న శాస్త్రవేత్తలు
- ఎలుకలపై ఈ ప్రొటీన్ నిరోధక చికిత్స, అద్భుత ఫలితాలు
- ఎలుకల్లో ఆయుర్ధాయం పెరుగుదల, శారీరక దృఢత్వం వృద్ధి
- ఈ చికిత్సతో మనుషుల్లోనూ మంచి ఫలితాలు ఉంటాయంటున్న శాస్త్రవేత్తలు



**హైదరాబాద్ పెన్ పవర్:** వార్ధక్యాన్ని జయించాలనేది తరతరాలుగా మనిషి కంటున్న కల. ఆధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో ఈ దిశగా పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతుండగా తాజాగా కీలక ముందడుగు పడింది. వార్ధక్యానికి కారణమయ్యే ఓ కీలక ప్రొటీన్‌ను శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. దీన్ని కట్టడి చేసే చికిత్స ద్వారా ఎలుకల జీవితకాలాన్ని ఏకంగా 25 శాతం మేర పెంచగలిగారు. వయసు పెరుగుదలకు ఇంటర్ ల్యూకిన్ - 11 అనే ప్రొటీన్ కారణమవుతోందని సింగపూర్‌లోని డ్యూక్ - ఎన్‌యూఎస్ మెడికల్ స్కూల్ శాస్త్రవేత్తలు గుర్తించారు. మనుషుల్లో గుండె, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తుల పనితీరుపై ఐఎల్-11 కీలక ప్రభావం చూపుతోందని గుర్తించారు. వయసుతో పాటు ఈ ప్రొటీన్ ఉత్పత్తి పెరుగుతున్న కొద్దీ కాలేయంలో, పొట్టలో కొవ్వు పేరుకుపోతుందని, కండరాలు బలహీనపడుతున్నాయని వెల్లడించారు. ఇవన్నీ శారీరక దృఢత్వాన్ని తగ్గించి, తద్వారా వయసు పెరుగుదల ప్రక్రియను కొనసాగిస్తున్నాయని తెలిపారు.

**ఎలుకల్లో ఆయుర్దాయం వృద్ధి**
ఐఎల్-11 ప్రొటీన్‌ను నిరోధించిన శాస్త్రవేత్తలు ఎలుకల జీవిత కాలాన్ని 25 శాతం మేర పెంచగలిగారు. ఆడ ఎలుకల్లో ఐఎల్-11 నిరోధక చికిత్స ద్వారా శారీరక క్షీణత, వ్యాధులు, బలహీనత, మొదలైన వాటి నుంచి రక్షణ లభించింది. ఇదే చికిత్సతో మగ ఎలుకల జీవితకాలం 22.5 శాతం మేర పెరిగింది. అంతేకాకుండా, ఆరోగ్య సమస్యలు తీసుకొచ్చే తెల్ల కొవ్వు బదులు, క్యాలరీలను ఖర్చు చేసే బ్రౌన్ ఫ్యాట్ ఉత్పత్తి ఎలుకల్లో మొదలైంది. ఈ ఫలితాలపై డ్యూక్ - ఎన్‌యూఎస్ డీన్ ప్రొఫెసర్ సథామస్ కాఫ్‌మన్ మాట్లాడుతూ.. ఐఎల్-11 చికిత్సతో వృద్ధులు మరింత ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించడానికి దోహదపడతాయని చెప్పారు. శారీరక దృఢత్వం పెరిగి వృద్ధులు జారి పడే అవకాశాలు తగ్గుతాయని అన్నారు. "ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆరోగ్యవంతమైన దీర్ఘకాలిక జీవితాలు గడిపేలా ఐఎల్-11 చికిత్సను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా లక్ష్యం' అని ఈ పరిశోధనలో పాలుపంచుకున్న శాస్త్రవేత్త స్టార్ట్‌కుక్ పేర్కొన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలు తాజాగా సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

# శ్రీలంక దిగ్గజాన్ని దాటిన రూట్.. సచిన్ ఆల్ టైం రికార్డ్‌పై కన్ను



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ జో రూట్ టెస్టుల్లో తన పరుగుల ప్రవాహాన్ని కొనసాగిస్తున్నాడు. వెస్టిండీస్ తో జరుగుతున్న రెండో టెస్టులో ఒక అరుదైన ఘనత అందుకున్నాడు. నాటింగ్‌హామ్‌లోని ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల లిస్టులో 9 స్థానానికి చేరుకున్నాడు. మొదటి రోజు ఆటలో భాగంగా 15 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద శ్రీలంక దిగ్గజం మహేల జయవర్ధనేని దాటడంతో ఈ ఘనత అందుకున్నాడు.

జయవర్ధనే 11,814 పరుగులు చేసి 10 వ స్థానంలో ఉండగా.. రూట్ 11,818 పరుగులతో 9 వ స్థానంలో ఉన్నాడు. ఓవరాల్ గా ఈ లిస్టులో భారత క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 15921 పరుగులతో టాప్ లో ఉన్నారు. రూట్ మరో 4104 పరుగులు చేస్తే టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో సచిన్ ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలోకి దూసుకొస్తాడు.

రూట్ ఇంగ్లాండ్ తరపున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల లిస్ట్ లో రెండో స్థానంలో నిలిచాడు. మొదటి స్థానంలో అలెస్టర్ కుక్ (12472) ఉన్నాడు. ప్రస్తుతం రూట్ వయసు 33 సంవత్సరాలు. వైట్ బాల్ క్రికెట్ కు మరో నాలుగేళ్లు దూరంగా ఉండి టెస్ట్ క్రికెట్ లో కొనసాగితే సచిన్ ఆల్ టైం రికార్డ్ ను బ్రేక్ చేసినా ఆశ్చర్యం లేదు. మరో 655 పరుగులు చేస్తే టాప్ 5 లో నిలుస్తాడు.ం

టెస్ట్ కెరీర్ లో 142 టెస్టుల్లో 259 ఇన్నింగ్స్ లు ఆడిన ఈ ఇంగ్లీష్ బ్యాటర్ ఖాతాలో 31 సెంచరీలు 62 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే రూట్ 18 పరుగులు చేసి ఔటయ్యాడు. వెస్టిండీస్ తో ప్రస్తుతం జరుగుతున్న టెస్టులో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో 416 పరుగులకు ఆలౌటైంది. పోప్ (123) సెంచరీతో టాప్ స్కోరర్ గా నిలిచాడు.

# 27 పరుగులకే 3 వికెట్లు.. వీరోచిత సెంచరీతో గెలిపించిన సామ్ కరణ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ లో జరుగుతున్న టీ20 బ్లాస్ట్ లో ఆల్ రౌండర్ సామ్ కరణ్ టాప్ ఇన్నింగ్స్ తో సత్తా చాటాడు. ఆల్ రౌండర్ గా క్రికెట్ లో అదరగొడుతున్న కరణ్.. సెంచరీ చేసి మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడడం విశేషం. గత కొంత కాలంగా బ్యాటింగ్ లో ఎంతో పరిణితి చూపిస్తున్న ఈ ఇంగ్లాండ్ ఆటగాడు.. స్పెషలిస్ట్ బ్యాటర్ వలె ఆడాడు. సర్రే తరపున ఆడుతున్న కరణ్.. హాంప్‌షైర్ పై 58 బంతుల్లో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

కరణ్ సూపర్ ఆట తీరుతో సర్రే 184 పరుగుల లక్ష్యాన్ని మరో 5 బంతులు మిగిలి ఉండగానే ఛేజ్ చేసింది. అతని ఇన్నింగ్స్ లో 7 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. ఒకదశలో సర్రే 27 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. విల్ జాక్స్(6), ఇవాన్స్(8), బర్న్స్(7) విఫలమయ్యారు. ఈ దశలో ఓపెనర్ సిబిలీ (27)తో కరణ్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. బౌండరీల మోత మోగిస్తూ జట్టును విజయ తీరాల వైపుకు నడిపించాడు. సిబిలీ ఔటైనా ఓవర్టన్ (21) తో కలిసి విజయాన్ని పూర్తి చేశాడు. పంజాబ్ పై రూ. 18.5 కోట్ల రూపాయలకు సామ్ కరణ్ ను కొన్న సంగతి తెలిసిందే. కరణ్ ఆడిన ఈ ఇన్నింగ్స్ తన ఐపీఎల్ కెరీర్ కు ఉపయోగపడొచ్చు. ఇదే ఫామ్ కొనసాగిస్తే 2025 ఐపీఎల్ లో పంజాబ్ కింగ్స్ అతన్ని రిటైన్ చేసుకునే అవకాశం ఉంది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన హాంప్‌షైర్ 19.5 ఓవర్లలో 183 పరుగులకు ఆలౌటైంది. 184 పరుగుల లక్ష్యాన్ని సర్రే 19.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసి గెలిచింది.

# తప్పించారా..? రెస్ట్ ఇచ్చారా.? శ్రీలంక సిరీస్‌కు ఎంపిక కాని జడేజా

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక పర్యటనలో భాగంగా టీమిండియా ఎంపికలో భాగంగా అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. కొంతమంది ప్లేయర్లకు లక్కీగా అవకాశం దక్కితే మరికొందరికి అన్యాయం జరిగింది. ఈ లిస్టులో టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా కూడా ఉన్నాడు. శ్రీలంకతో జరగనున్న మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లకు ఇండియా టీమ్‌ను గురువారం ప్రకటించారు. అయితే ఈ టూర్ లో వన్డే జట్టులో జడేజాకు చోటు దక్కపోవడం ఆశ్చర్యకరంగా అనిపించింది. వరల్డ్ కప్ 2024 తర్వాత జడేజా అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వన్డేల్లో, టెస్టుల్లో కొనసాగుతానని చెప్పాడు. భారత జట్టులో దశాబ్ధకాలంగా సీనియర్ ఆల్ రౌండర్ గా జడేజా తనదైన ముద్ర వేశాడు. వన్డే జట్టులో అతనికి చోటు దక్కడం ఖాయమనుకున్నారు. అయితే ఈ స్పిన్ ఆల్ రౌండర్ కు సెలక్టర్లు బిగ్ షాక్ ఇచ్చారు. ఆల్ రౌండర్ల కోటాలో వాషింగ్ టన్ సుందర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే లను ఎంపిక చేశారు. దీంతో జడేజాకు నిరాశ తప్పలేదు. సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ శ్రీలంక సిరీస్ కు ఎంపికయ్యారు. మరోవైపు జస్ప్రీత్ బుమ్రా రెస్ట్ తీసుకున్నట్టు తేలింది. హార్దిక్ పాండ్య వ్యక్తిగత కారణాల వలన వన్డే సిరీస్ నుంచి తప్పుకున్నాడు. అయితే జడేజా విషయంలో క్లారిటీ రావడం లేదు. అతనికి రెస్ట్ ఇచ్చారో లేకపోతే జట్టు నుంచి తప్పించారో పెద్ద ప్రశ్నగా మారింది. వస్తున్న సమాచార ప్రకారం జడేజాను తప్పించారనే వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే టీ20లతో పాటు జడేజా వన్డే కెరీర్ ముగిసినట్టే.





నికితా దత్తా యొక్క ఫ్యాషన్ మూమెంట్స్

# వాళ్లిద్దరిలా ఐశ్వర్యారాయ్ ఎందుకు చేయలేకపోతుంది?



**హైదరాబాద్ పెన్ పవర్:** హీరోయిన్ గా ఓ స్థాయికి చేరిన తర్వాత వాళ్లంతా లేడీ ఓరియేంటెడ్ చిత్రాలపై ఆసక్తి చూపించి సక్సెస్ దిశగా అడుగులేస్తుంటారు. లేడీ సూపర్ స్టార్ నయనతార..జ్యోతిక...అనుష్క లాంటి వాళ్లు ఇప్పుడలాగే కెరీర్ సాగిస్తున్నారు. ఇంకాస్త ముందుకెళ్తే బాలీవుడ్ నుంచి రాణీముఖర్జీ...విద్యాబాలన్..కరీనా కపూర్ లాంటి సీనియర్లు అదే పంథాలో కెరీర్ సాగిస్తున్నారు. ఇక నవతరం భామల విషయానికి వస్తే అలియాభట్...రష్మిక మందన్నా.. దీపికాపదుకొణే..కత్రినా కైఫ్ లు కూడా హీరోయిన్లగా నటిస్తూనే అప్పుడప్పుడు ఉమెన్ సెంట్రిక్ చిత్రాలు చేస్తున్నారు. రాణీముఖర్జీ.. విద్యాబాలన్ లాంటి సీనియర్ నాయికలైతే లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్లో తమకంటూ ఓ ఇమేజ్ ని సంపాదించుకున్నారు. వీలైనంత వరకూ అలాంటి కంటెంట్ ఉన్న చిత్రాల్లో నేటించడానికే ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. మరోవైపు ఫ్యామిలీకి కావాల్సినంత సమయాన్ని కేటాయిస్తూనే ప్రొఫెషనల్ గా బిజీగా ఉంటున్నారు. కానీ వీళ్లిద్దరిలో ఐశ్వర్యారాయ్ సెకెండ్ ఇన్నింగ్స్ మాత్రం సాగలేదనే చెప్పాలి. ఒకప్పుడు హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగినా సెకెండ్ ఇన్నింగ్స్ లో అంతటి ఛరిష్మాతో దూసుకుపోలేదు అని చాలా కాలంగా ఓ విమర్శ వినిపిస్తూనే ఉంది.

కానీ ఈ చిత్రం పెద్ద సక్సెస్ కాలేదు. ఆ తర్వాత

మళ్లీ ఐశ్వర్య పేరు వినిపించింది అంటే అది కేవలం పొన్నియన్ సెల్వన్ తోనే. మణిరత్నం బ్రాండ్ తోనే అది సాధ్యమైంది. ఆ రకంగా చూస్తే ఐశ్వర్యా రాయ్ లేడీ ఓరియేంటెడ్ చిత్రాల పరంగా పూర్తిగా వెనుకబడే ఉంది. సీరియస్ గా ఆమె ఆ తరహా ప్రయత్నాలు కూడా చేసినట్లు ఎక్కడా కనిపించలేదు.

లేడీ ఓరియేంటెడ్ చిత్రాల ద్వారా ప్రత్యేకమైన ఇమేజ్ దక్కుతుంది. బాక్సాఫీస్ వద్ద సోలో నాయికగా సత్తా చాటడానికి అవకాశం ఉన్న ఒకే మార్గం అది. కోట్లాది మంది అభిమానులు..భారీ ఎత్తున ఫ్యాన్ బేస్ ఉన్నాఐశ్వర్య ఆ క్రేజ్ ని ఎన్ క్యాష్ చేసుకోవడంలో పూర్తిగా విఫలమైంది. ఇప్పటికే ఆమె శరీరంలో వస్తోన్న కొన్ని రకాల మార్పులతో తీవ్ర విమర్శలు కూడా ఎదుర్కుంటుంది. ప్రస్తుతం ఆమె వయసు 50. ప్రయోగాలు చేసే ఏజ్ కూడా కాదు. మళ్లీ 25 ఏళ్ల క్రితం నాటి ఐశ్వర్యని చూపించడం అంటే సవాల్ తో కూడుకున్నదే.

దేవియాని శర్మ లేటెస్ట్ లుక్స్ అందరి దృష్టిని ఆకర్షించాయి



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com